కుట్రలకు బెదరం.. పోరాటం ఆపం

దృష్టి మళ్లించేందుకే డ్రగ్స్ డ్రామా

- నేరుగా ఎదుర్కొనే దమ్ములేకే కుటుంబాల జోలికి!
- కేటీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే కక్ష సాధింపు
- కాంగ్రెస్ సర్కారుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ): పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే జన్వాడలోని కేటీఆర్ బంధువుల ఇంట్లో డ్రగ్స్ దావత్ అంటూ సీఎం రేవంత్‌రెడ్డి కొత్త డ్రామాకు తెరలేపారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ సోషల్‌మీడియాలో దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని ఆదివారం ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు. కేటీఆర్ ఇమేజ్‌ను డ్యామేజ్ చేసేందుకు ప్రభుత్వం కక్ష సాధింపునకు దిగుతున్నదని విమర్శించారు. కేటీఆర్ బావమరిది ఇంట్లో ఫ్యామిలీ ఫంక్షన్ ఉన్న విషయం ముందే తెలుసుకొన్న మంత్రులు.. దీపావళికి ముందే బాంబులు పేల్చుతామని చెప్పి, పక్కా స్కెచ్ ప్రకారమే ఈ దాడులు చేయించారని ఆరోపించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, భార్యాభర్తలు పాల్గొన్న ఫ్యామిలీ ఫంక్షన్‌పై దాడి చేసి రేవ్ పార్టీగా చిత్రీకరించారని విమర్శించారు. ఈ పార్టీకి కేటీఆర్, ఆయన సతీమణి వెళ్లకపోయినా వెళ్లినట్టు చిత్రీకరించడం గర్హనీయమని పేర్కొన్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వ ఒత్తిళ్లకు లొంగవద్దని, వ్యవస్థపై అపనమ్మకం కలిగేలా వ్యవహరించొద్దని విజ్ఞప్తిచేశారు. ప్రత్యక్షంగా తమ ప్రత్యర్థులను ఎదుర్కొనే దమ్ములేకనే కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ నేతల కుటుంబాలను టార్గెట్ చేస్తున్నదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కొందరు వ్యక్తులు ప్రత్యక్షంగా తమ ప్రత్యర్థులను ఎదుర్కోలేకపోతే వారు కుటుంబాలను లక్ష్యం చేసుకుంటారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేటీఆర్, బీఆర్‌ఎస్ పార్టీని ఎదుర్కోలేక నీచ రాజకీయాలకు దిగింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేసిన ప్రతీకార రాజకీయ చర్యలు, డైవర్షన్ పాలిటిక్స్‌తోపాటు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తల అక్రమ అరెస్టులను ఖండిస్తున్న. ఈ ఘటనతో రాహుల్‌గాంధీని ప్రసన్నం చేసుకోవాలనే తపన కనిపిస్తున్నది. సిగ్గుచేటు. తెలంగాణ కాంగ్రెస్ వైఫల్యం చెందింది. కాంగ్రెస్ చౌకబారు రాజకీయాలు వెల్లడయ్యాయి' అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

హామీలు అమలు చేతగాక నిందలా? : సిరికొండ

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయడం చేతగాక ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నదని, రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. బీఆర్‌ఎస్ నేతలపై, కేటీఆర్ బావమరిదిపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్‌ను ఎదుర్కోలేకే నీచ రాజకీయాలకు దిగిందని విమర్శించారు. దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు.

కేటీఆర్‌ను ప్రజలే రక్షించుకుంటారు: జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, అక్టోబర్ 27: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంటిపై పోలీసులు దౌర్జన్యం చేయడాన్ని ఆ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష పార్టీ నేత ఇంటిపై పోలీసులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, ఎక్కడ ఏదో జరిగితే అది కేటీఆర్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. కారణం లేకుండా, వారెంట్ లేకుండా సోదాలు ఎలా చేస్తారని నిలదీశారు. రేవంత్ సోదరులపై చాలా ఆరోపణలు వస్తున్నాయని, వారి ఇండ్లపై పోలీసులు రైడ్ చేసే దమ్ముందా? అని ప్రశ్నించారు. చిల్లర దాడులు తమను భయపెట్టవని, తమకు అరెస్టులు కొత్తకాదని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యం, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి దాడులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

మొదటిపేజీ తరువాయి...

తెగించి వచ్చినవాళ్లం.. వెనక్కు తగ్గం.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చెండాడుతూనే ఉంటాం అని స్పష్టంచేశారు.

ఆదివారం జన్వాడలో తన బావమరిది రాజ్ పాకాల ఇంటిపై పోలీసులు నిర్వహించిన సోదాలపై కేటీఆర్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాలనలో ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. "గత పదకొండు నెలలుగా తెలంగాణలో నెలకొని ఉన్న పరిస్థితులు, ముఖ్యంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వారి వరుస వైఫల్యాలు, నూరు రోజుల్లో చేస్తానన్న ఆరు గ్యారంటీలు కావచ్చు, మూసీ కుంభకోణం కావచ్చు, రేవంత్ బావమరిదికి కట్టబెట్టిన అమృత్ టెండర్లు కావచ్చు, వారు చేస్తున్న వివిధ సివిల్ సప్లై స్కామ్ కానీ, వరుసగా జరుగుతున్న వైఫల్యాలను ఎండగడుతూ ఈ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా వ్యవహరిస్తున్నాం. ఎక్కడా భయపడకుండా, జంకకుండా, రాజీలేకుండా, ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా అన్నింటినీ తట్టుకుంటూ మా నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ నేర్పిన ఉద్యమబాటలో నడుస్తూ వచ్చాం. రాజకీయంగా సమాధానం చెప్పే సమర్థత లేదు. మేము లేవనెత్తే ప్రశ్నలకు విరవణాత్మకంగా, ప్రజలను సంతృప్తి పరిచే విధంగా సమాధానం చెప్పే పరిస్థితి అంతకంటే లేదు. అందుకే మమ్మల్ని ఎదుర్కోలేక ఇవాళ మా కుటుంబ సభ్యుల మీద, మా బంధువుల మీద కేసులు బనాయించి మా మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయాలని, ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయాలనే కుట్రతో, మా గొంతు నొక్కాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లున్నది. నేను కాంగ్రెస్ నాయకత్వానికి.. అది రేవంత్‌రెడ్డి కావచ్చు, రాహుల్ గాంధీ కావచ్చు.. వారికి చెప్పేదొకటే, మేము ఉద్యమంలో నుంచి వచ్చిన వాళ్లం. మీరు పెట్టే కేసులకు, మీరు చేసే ఈ చిల్లర ప్రయత్నాలకు భయపడేవాళ్లం అంతకంటే కాదు. ప్రాణాలకు తెగించి కొట్లాడుతాం. తెలంగాణ కోసం ఉద్యమంలోకి వచ్చినరోజే చావుకు తెగించి వచ్చాం" అని కేటీఆర్ చెప్పారు.

రేవ్‌పార్టీ అంటూ పైశాచిక ఆనందం

"నిన్నటి నుంచి ఈ రోజు వరకు, దాదాపు 22గంటలపాటు ఒక ప్రహసనంలా తనిఖీలు చేస్తున్నారు. నేను అడుగుతున్నా.. తెలంగాణలో ఒక కుటుంబం తన కుటుంబ సభ్యులతో, బంధు మిత్రులతో కలిసి దావత్ చేసుకోవడం తప్పా? దసరాకు, దీపావళికి ఇంట్లో దావత్ చేసుకోవడం కూడా తప్పేనట, దానికి కూడా పర్మిషన్ తీసుకోవాలని అడుగుతున్నారు. రాజ్ పాకాల పది పదిహేను రోజుల క్రితం జన్వాడలోని రిజర్వు కాలనీలో ఇల్లు కట్టుకొని అక్కడికి వెళ్లాడు. వాస్తవానికి అది ఫామ్‌హౌస్ కాదు. రాజ్ పాకాల ఉండే ఇల్లు. ఆయన గృహప్రవేశం చేశాడు కాబట్టి బంధుమిత్రులను పిలిచారు. అది గృహప్రవేశం దావత్. దసరా, దీపావళి సందర్భంగా చేసుకున్న ఫ్యామిలీ ఫంక్షన్ అది. కానీ కొందరు దాన్ని సోషల్ మీడియాలో రేవ్ పార్టీ అని పేర్కొంటూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. అందులో 70సంవత్సరాల వయసున్న మా అత్తగారు సహా రెండు, నాలుగు, ఏడేళ్ల వయసున్న చిన్న పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు భోజనం చేస్తుంటే, అందులో మద్యం కూడా ఉండొచ్చు. బంధుమిత్రుల ఫంక్షన్‌ను రేవ్ పార్టీ అని పైశాచిక ఆనందం పొందుతున్నారు. పురుషులు, మహిళలు ఉన్నట్టు సోషల్ మీడియాలో చెబుతున్నారు. వారు పురుషులు, మహిళలు కాదు.. వాళ్లు భార్యా భర్తలు, కుటుంబ సభ్యులు. అసలు రేవ్ పార్టీ అంటే అర్థం తెలుసా, ఫ్యామిలీ ఫంక్షన్‌ను రేవ్ పార్టీ అనడం ఏమిటి? కుటుంబ సభ్యుల ఫంక్షన్‌ను భూతద్దంలో పెట్టి అధికారంలో ఉన్న కొందరు ప్రజల్లో అనుమానాలు తలెత్తేలా వ్యవహరిస్తున్నారు. 22గంటలు శోధించి, పరిశోధించి కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా చేశారు. సోదాల్లో డ్రగ్స్ దొరకలేదని సాక్షాత్తూ ఎక్సైజ్ శాఖ అధికారులే స్టేట్‌మెంట్ ఇచ్చారు. స్నిఫర్ డాగ్స్‌తో కూడా శోధించారు. ఏమీ దొరకలేదు. యూరిన్ టెస్ట్ చేసినా ఏమీ దొరకలేదు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు కూడబలుక్కొని దూషిస్తున్న నా బావమరిదికి కూడా నెగెటివ్ వచ్చింది. అయినా పురుషులు, మహిళలు అని, డ్రగ్స్ అని, రేవ్ పార్టీ అని అసత్య ప్రచారం చేయడం దుర్మార్గం. 13మందికి నెగెటివ్ వస్తే ఒక్కరికి మాత్రం పాజిటివ్ వచ్చింది. ఆయన డ్రగ్స్ ఎక్కడ తీసుకున్నాడో తెలియదు. దాన్ని దర్యాప్తు చేయాల్సింది పోయి రకరకాలుగా అసత్య ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమో రాష్ట్రం ఆలోచించాలి." అని కేటీఆర్ సూచించారు.

నేను ఎర్రవల్లిలో ఉంటే.. అక్కడ ఉన్నానట..

"నేను జన్వాడలో మా బావమరిది ఇంట్లో ఉండి ఐదు నిముషాల ముందే అక్కడి నుంచి వెళ్లినట్టు కొందరు చెబుతున్నారు. నేను నిన్న సాయంత్రం ఏడున్నర, ఎనిమిది గంటలవరకు కేసీఆర్‌తో ఎర్రవల్లిలో ఉన్నాను. అక్కడి నుంచి ఇంటికొచ్చి, భోజనం చేసి, గంటసేపు టీవీ చూసి పడుకున్నా. తెల్లారేసరికి ఈ మెసేజ్‌లు వస్తున్నాయి. ఇష్టమొచ్చినట్టు ఇటువంటి వార్తలు వేయవచ్చా. నన్ను, నా భార్యను ఇష్టమొచ్చినట్లు మీడియా అనొచ్చా. మేము పబ్లిక్ లైఫ్‌లో ఉన్నామంటే మేము పబ్లిక్ ప్రాపర్టీనా. ఏదైనా అనొచ్చా. రాజ్ పాకాల చేసిన తప్పేంటి. ఆయన ఇంట్లో ఆయన తల్లిని, తమ్ముళ్లను పిలుచుకొని కొత్తింట్లోకి పోయినందుకు దావత్ చేసుకున్నాడు. దానికి రేవ్ పార్టీ అని, దానికో పెద్ద సినిమా చేసి దాడులు చేస్తున్నారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వానికి చేయాల్సిన పనులు ఎన్నో ఉన్నాయి. పోలీసులు పోలీసులను కొడుతున్నారు రోడ్లమీద. అది కనపడడంలేదా. 39మంది సస్పెండ్ అయ్యారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, ఎన్ని రకాలుగా మమ్మల్ని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేసినా మేము వెనక్కు తగ్గం. తప్పకుండా పోరాటం కొనసాగిస్తాం. జైలుకు పంపినా, ఇంకా ఎక్కడికి పంపినా ముమ్మాటికీ కేసీఆర్ నేర్పిన ఉద్యమ బాటలోనే నడుస్తాం. ప్రజల పక్షాన పోరాడుతాం. పరిపాలనా వైఫల్యాలను, అసమర్థతను, అవినీతిని ఎండగడుతూనే ఉంటాం. వెనక్కు తగ్గం." అని కేటీఆర్ స్పష్టంచేశారు.

మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

డ్రగ్స్ లేనప్పుడు ఈ సెక్షన్లు ఎలా?

"మద్యం నాలుగు లీటర్లు ఉండాల్సిన చోట ఎడెనిమిది బాటిళ్లు ఎక్కువ దొరికినాయి.. ఆ కేసు పెడుతున్నాం అని ఎక్సైజ్ అధికారులు అన్నారు. ఉదయం అది ఎక్సైజ్ కేసు అయితే సాయంత్రానికి మొత్తం మారిపోయింది. ఎన్‌డీపీఎస్ కేసు అని.. 25, 27,29 సెక్షన్లు పెట్టారు. ఇవి సప్లయర్, కంజమ్షన్, కోహోస్ట్‌కు సంబంధించిన సెక్షన్లు. సప్లయర్ అంటే డ్రగ్స్ ఎవరైనా సేవించి అయినా ఉండాలి, లేక సరఫరా చేసి ఉండాలి. అసలు అక్కడ డ్రగ్స్ దొరకనప్పుడు, డ్రగ్స్ లేనప్పుడు ఈ సెక్షన్ ఎలా పెడతారు? పైనుంచి ఆదేశాలు వస్తే కేసు మారిపోతుందా ? కంజమ్షన్ అన్నారు... అక్కడ 14మందికి టెస్ట్ చేస్తే 13మందికి నెగెటివ్ వచ్చి ఒక్కరికి పాజిటివ్ వస్తే అది దర్యాప్తు చేయాల్సింది పోయి ఒక్క మిల్లీగ్రామ్ కూడా మత్తు పదార్థం దొరక్కపోయినా ఎలా బదనాం చేస్తారు? కోహోస్ట్.. అసలు హోస్టింగే లేనప్పుడు కోహోస్ట్ ఎక్కడిది? మమ్మల్ని, మా పార్టీని ఎదుర్కోలేక, మా గొంతు నొక్కడానికి చేతుల్లో అధికారం ఉందికదా.. ఇష్టమొచ్చినట్లు వాడతాం అని రేవంత్ రెడ్డి అనుకుంటే ఆయనకు ఒక్కటే చెబుతున్నా. చావుకు తెగించి వచ్చినవాళ్లం. వెనక్కు తగ్గం.. తప్పకుండా కాంగ్రెస్ పార్టీని చెండాడుతాం. బాంబులు గీంబులు అంటే ఏదో చేస్తారనుకున్నాం. ఇప్పుడు చూస్తే కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుంది వీళ్ల కథ. చేతనైతే రాజకీయంగా తలపడండి, శాసనసభ సమావేశాలు పెట్టండి. రుణమాఫీ, మూసీ సుందరీకరణ, ఆరు గ్యారంటీల అమలు, సావధానంగా చర్చించి కేసీఆర్ ఆధ్వర్యంలో మిమ్మల్ని ఎండగట్టడానికి సిద్ధంగా ఉన్నాం. గొంతునొక్కి, కుటుంబ సభ్యులను వేధించి ఏదో సాధిస్తామనుకుంటే మీరు సాధించేది ఏమీ ఉండదు." తేల్చిచెప్పారు.

నేను చెప్పని మాటలను ఎఫ్ఐఆర్‌లో రాశారు : విజయ్ మద్దూరి

తాను చెప్పని మాటలను పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారని రాజ్ పాకాల స్నేహితుడు విజయ్ మద్దూరి ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ ఆరోపణలపై ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'నా మిత్రుడు రాజ్ పాకాల మమ్మల్ని కుటుంబ సమేతంగా దీపావళి పండుగ కోసం ఆహ్వానించారు. అక్కడ ఎలాంటి ఇల్లీగల్ అక్టివిటీస్ జరగలేదు. కానీ మమ్మల్ని టార్గెట్ చేస్తూ పోలీసులు చేస్తున్న అలిగేషన్స్ చాలా అన్యాయం.. మేం ఎటువంటి తప్పూ చేయలేదు. కొద్ది రోజుల క్రితమే మేము ప్రపంచ పర్యటన చేసుకొని ఇండియాకు వచ్చాం. వాటి ఆధారాలను కూడా పోలీసులకు చూపించాం. అయినా వాళ్లు ఎఫ్ఐఆర్‌లో నేను చెప్పని మాటలు కూడా చెప్పినట్టుగా రాస్తున్నారు. నేను అమెరికన్ సిటిజన్‌ను. 30 ఏండ్లకు పైగా సాఫ్ట్‌వేర్ రంగంలో అనుభవం ఉన్నవాడిని. తప్పుడు ప్రచారంతో నా ప్రతిష్ఠను మంట గలుపుతున్నారు. నిజాలు తప్పకుండా బయటకు వస్తయ్' అంటూ వివరించారు.

ప్రశాంత రాష్ట్రంలో అశాంతి: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): ప్రశాంతంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో అశాంతిని రగిల్చింది ఎవరు? అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల పోలీసులు, ఏఈవోలు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారని అని ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా నిలదీశారు. 'ప్రశాంత రాష్ట్రంలో అశాంతిని రగిల్చింది ఎవరు? కాంగ్రెస్ ప్రభుత్వ తుగ్లక్ నిర్ణయాలు కాదా? రేవంత్‌రెడ్డి అనాలోచిత విధానాలు కాదా? డిజిటల్ సర్వే పేరుతో ఏఈవోల మీద వేటు! పనిభారంపై ప్రశ్నించినందుకు పోలీసులపై వేటు! ఇప్పుడు తెలంగాణ ప్రతి మనిషి ఆలోచిస్తున్నది. ఎట్లుండె తెలంగాణ! ఎట్లాయె తెలంగాణ!!' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

సూర్యాపేటలో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి

కేటీఆర్ ఇంటిపై పోలీసుల దౌర్జన్యమా?

మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఫైర్

సూర్యాపేట, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంటిపై పోలీసులు దాడి చేయడాన్ని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆదివారం కేటీఆర్ ఇంట్లో పోలీసుల సోదాలు చేయడాన్ని తప్పుబట్టారు. కారణం, వారెంట్ లేకుండా పోలీసులు తనిఖీల పేరుతో దాడులకు పాల్పడటం ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శనమని మండిపడ్డారు. కేటీఆర్ బావమరిది గృహప్రవేశం సందర్భంగా జరుగుతున్న దావత్ విషయంలో లేనిపోని ప్రచారం చేసి పోలీసులు దాడి చేయడం హేయమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. ఎక్కడో ఏదో జరిగితే కేటీఆర్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఆదివారం సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్ పట్ల పోలీసులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

పోలీసులతో వాగ్వాదానికి దిగిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

రేవంత్ సర్కార్ డైవర్షన్ కుట్ర

- ప్రజాగ్రహంతో సర్కారుకు దడ.. పోలీసు డ్రామాకు జన్వాడ
- రాజ్‌పాకాల ఇంటిపై అర్ధరాత్రి ఎక్సైజ్ పోలీసుల దాడి
- దాదాపు 21 గంటలపాటు సోదాలు
- మహిళలు, పిల్లలున్న దావత్‌కు రేవ్‌పార్టీగా ముద్ర వేసే కుట్ర
- కేటీఆర్, బావమరిది ఇండ్లలో సోదాలు
- బిగ్‌బాస్ ఆదేశాలతో మారిన సీన్

హైదరాబాద్/సిటీబ్యూరో/చేవెళ్ల రూరల్/శేరిలింగంపల్లి/కొండాపూర్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : జన్వాడలో మాజీ మంత్రి కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల తన కుటుంబ సభ్యులతో నిర్వహించుకుంటున్న దావత్‌పై సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శించారు. ఇటీవల కొత్త ఇంట్లోకి గృహప్రవేశం చేసిన సందర్భంగా కుటుంబసభ్యులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్, బంధుగణంతో తన ఇంట్లో రాజ్ పాకాల దావత్ నిర్వహిస్తుండగా.. పోలీసులు పథకం ప్రకారం దాడి చేసి శనివారం అర్ధరాత్రి నానా హంగామా సృష్టించారు. 'ఇక్కడ రేవ్ పార్టీ జరుగుతున్నదనే సమాచారం మాకుంది. డయల్ 100కు కాల్ చేశారు. అందరూ డ్రగ్స్ టెస్టులకు సహరించాలి' అంటూ అక్కడున్న కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురిచేశారు. 'ఇదంతా ఫ్యామిలీ పార్టీ.. ఇక్కడ డ్రగ్స్ ఎందుకు ఉంటాయి. కాకపోతే కొందరు మద్యం తాగారు. అంతకు మించి ఇంకేమీ లేదు' అని కుటుంబసభ్యులు ఎంత వారించినా పోలీసు సిబ్బంది వినకుండా పథకం ప్రకారం ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన జన్వాడకు చేరుకున్న ఎక్సైజ్ సిబ్బంది పరిమితికి మించి ఉన్నాయన్న ఆరోపణలతో 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అందరికీ డ్రగ్స్ టెస్టులు చేయాలని రెచ్చగొట్టి, పోలీసులు నానా హంగామా చేశారని బాధితులు చెప్పుకొచ్చారు. ఆ ఫ్యామిలీ గెట్ టు గెదర్‌లో రాజ్ పాకాల తల్లి, మాజీ మంత్రి కేటీఆర్ అత్తమ్మ, వారి కుటుంబసభ్యులు, చిన్నపిల్లలు ఉండగా వారిని కూడా డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలని బలవంత పెట్టారు. వారు డ్రగ్స్ టెస్టులకు మొదట ఒప్పుకోకున్నా బలవంత పెట్టి.. టెస్టులు చేయగా అందరికీ నెగెటివ్ రిపోర్టు వచ్చింది. ఈ క్రమంలో ఇటీవల నెదర్లాండ్ నుంచి వచ్చిన విజయ్ మద్దూరి అక్కడి రూల్స్ ప్రకారం కొంత కొకైన్ తీసుకున్నాడని, అతనికి మాత్రమే పాజిటివ్ వచ్చినట్టు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు తెలిపారు. వృద్ధులు, పిల్లలు, చివరికి భార్యాభర్తలను విడదీసి మహిళలు, పురుషులుగా పోలీసులు లెక్కగట్టి మొత్తం 35 మంది పాల్గొన్నట్టు రిపోర్టులు రాశారు.

గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

పోలీసుల దాడిలో బాల్క సుమన్‌కు గాయాలు

రాయదుర్గంలోని రాజు పాకాల నివాసం ఓరియన్ విల్లాస్‌పై దాడులు చేస్తున్నారనే సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై పోలీసులు దాడులు చేశారు. సెర్చ్ వారెంట్ లేకుండా సోదాలెందుకు చేస్తున్నారని నిలదీస్తున్న సందర్భంలో పోలీసులు ఈడ్చిపడేశారు. ఈ ఘటనలో బాల్క సుమన్ కాళ్లకు గాయాలయ్యాయి. అయినా పోలీసులు బలవంతంగా వ్యాన్లలో ఎక్కించి ఆర్సీపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఇద్దరిపై కేసు నమోదు

అనుమతి లేకుండా పార్టీ జరుగుతున్నదని వచ్చిన సమాచారంతో జన్వాడలోని ఇంటిపై సైబరాబాద్ ఎస్‌వోటీ, ఆబ్కారీ పోలీసులు ఆదివారం తెల్లవారుజామున దాడులు జరిపినట్టు రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వెల్లడించారు. 7 విదేశీ మద్యం బాటిళ్లు, 10 దేశీయ మద్యం బాటిళ్లు, గేమ్స్‌కు సంబంధించిన కాయిన్స్ లభించినట్టు వివరించారు. విజయ్ మద్దూరి అనే వ్యక్తికి కొకైన్ పాజిటివ్ వచ్చినట్టు తెలిపారు. ఆ దావత్‌లో పాల్గొన్న అందరికీ నెగెటివ్ వచ్చినట్టు చెప్పారు. విజయ్‌ని రక్త పరీక్షల కోసం దవాఖానకు తరలించినట్టు చెప్పారు. ఈ మేరకు రాజ్ పాకాలతో పాటు విజయ్ మద్దూరిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద సెక్షన్ 25, 27, 29తో పాటు తెలంగాణ గేమింగ్ చట్టం 3, 4 సెక్షన్ల కింద మోకిల ఠాణాలో కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు. ఆబ్కారీ శాఖ నుంచి అనుమతి లేకుండా పార్టీ నిర్వహించినందుకు రాజ్ పాకాలపై ఎక్సైజ్ చట్టం ప్రకారం 34ఏ, 34(1), రెడ్‌విత్ 9 కింద కేసులు నమోదు చేసినట్టు వివరించారు.

జన్వాడలో ఏమీ దొరకలేదు

చేవెళ్ల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత

జన్వాడలో రేవ్ పార్టీ జరుగుతున్నదనే సమాచారంతో దాడులు చేశామని, కానీ అక్కడ ఎలాంటి డ్రగ్స్ దొరకలేదని చేవెళ్ల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత ప్రకటించారు. తనిఖీల అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎక్సైజ్ నిబంధనలు పాటించనందున కేసు నమోదు చేశామని వెల్లడించారు.

ఎలాంటి డ్రగ్స్ దొరకలేదు: జేసీ ఖురేషీ

జన్వాడలోని రాజ్ పాకాలకు చెందిన ఇంట్లో డ్రగ్స్‌గానీ, డ్రగ్స్‌కు సంబంధించిన ఆనవాళ్లు గానీ లభించలేదని దాడులకు నేతృత్వం వహించిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఖురేషీ స్పష్టం చేశారు. కొన్ని మద్యం బాటిళ్లు మాత్రమే లభించినట్టు వెల్లడించారు.

రేవ్ పార్టీగా చిత్రీకరించే కుట్ర

కేసీఆర్, కేటీఆర్ కుటుంబంపై బురదజల్లే నెపంతో ఆదివారం ఉదయం నుంచి పోలీసులు ప్రభుత్వ అనుకూల మీడియాకు లీకులు ఇవ్వడం ప్రారంభించారు. తెల్లవారుజాము నుంచే ఫ్యామిలీ దావత్‌ను 'రేవ్ పార్టీ'గా చిత్రీకరించిన కాంగ్రెస్ అనుకూల మీడియా నానా హడావుడి చేసింది. దీంతో పోలీసులు ఫారెస్ట్ రిజర్వ్ కాలనీలో అక్రమంగా దాడి చేసిన అంశాలపై దృష్టి మరల్చి.. అక్కడ భారీగా డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలు, విదేశీ మద్యం దొరికిందంటూ మీడియాకు లీకులు ఇస్తూనే ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ అంశంపై చర్చ జరుగుతుండటం.. కావాలనే కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని గ్రహించి.. బీఆర్‌ఎస్ ముఖ్య నేతలంతా హైదరాబాద్ చేరుకునే ప్రయత్నం చేశారు. రాష్ట్ర ఎక్సైజ్, పోలీసు ఉన్నతాధికారులు జన్వాడకు చేరుకొని దావత్ జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మీడియాలో చూపినట్టుగా అది రేవ్ పార్టీ కాదని, ఫ్యామిలీ దావత్ అని గుర్తించారు. మధ్యాహ్నానికే అది ఫ్యామిలీ దావత్ అని ప్రభుత్వ పెద్దలకు ఫీడింగ్ ఇవ్వడంతో సాయంత్రం వరకు ఆ ఇష్యూను కొనసాగించాలనే కుట్రలో భాగంగా రాయదుర్గంలోని విల్లాల్లో సోదాలకు యత్నించారు.

రాయదుర్గంలో ఉద్రిక్తత

రాజ్ పాకాల కేటీఆర్‌కు స్వయానా బామ్మర్ది కావడంతో కావాలనే రాజకీయ కుట్రను ప్రేరేపిస్తూ వారికి సంబంధించిన ఇండ్లల్లో సోదాలు చేసేందుకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు అత్యుత్సాహం చూపడంతో బీఆర్‌ఎస్ నేతలు అప్రమత్తమయ్యారు. వారే కావాలని ఏమైనా నిషేధిత వస్తువులు తీసుకెళ్లి, ఇండ్లలో సోదాల పేరుతో అక్కడ ఫలానా నిషేధిత వస్తువులు దొరికాయని చెప్పి అక్రమ కేసులు పెడతారనే ముందస్తు ఆలోచనతో బీఆర్‌ఎస్ నేతలు రంగంలోకి దిగారు. రాయదుర్గంలోని కేటీఆర్, రాజ్ పాకాల, అతడి సోదరుడు శైలేంద్ర ఇండ్లకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మొదట సెర్చ్ వారెంట్‌లు లేకుండా రావడంతో బీఆర్‌ఎస్ నేతలు అడ్డుకున్నారు. సెర్చ్ వారెంట్ లేకుండా ఎలా వస్తారని నిలదీశారు. తమను అడ్డుకున్న బీఆర్‌ఎస్ నేతలను పోలీసులు ఈడ్చి పడేశారు. అందినవారిని అందినట్టే ఇష్టారీతిన దొబ్బుతూ డొక్కల్లో గుద్దుతూ, మోకాళ్లతో తన్నుతూ గుంజి పడేశారు. అక్కడ ఆందోళనలు తీవ్రతరం అవుతుంటే మళ్లీ వెళ్లి సెర్చ్ వారెంట్ తీసుకొచ్చి, కొన్ని గంటల పాటు వారి ఇండ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎక్కడా ఏమీ లభించలేదు.

బీఆర్‌ఎస్ నేతల ముందస్తు అరెస్టులు

ఇటు రాజ్ పాకాల, అతడి సోదరుడు శైలేంద్ర, మాజీ మంత్రి కేటీఆర్ ఇండ్లలో సోదాలు చేసేందుకు పోలీసులు యత్నించడంతో బీఆర్‌ఎస్ నేతలు అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద గౌడ్, డాక్టర్ సంజయ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సహా ఇతర నేతలను అరెస్టు చేసి, గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేటీఆర్ ఇంట్లో ఉన్న నాయకులను అరెస్టు చేసి రామచంద్రాపురం పీఎస్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో కోరుట్ల ఎమ్మెల్యే డా.సంజయ్, డా.కురువ విజయ్ కుమార్, రాకేశ్, ముఠా జైసింహ, రాజీవ్ సాగర్, తుంగ బాలు తదితరులు ఉన్నారు.

అనుమతి లేనందున కేసులు పెట్టాం

శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత రాజ్ పాకాలకు సంబంధించిన ఇంట్లో అనుమతి లేకుండా పార్టీ జరుగుతున్నదని వచ్చిన సమాచారం మేరకు సైబరాబాద్ పోలీసులతో కలిసి దాడులు జరిపాం. తనిఖీల్లో ఎలాంటి డ్రగ్స్ లభించలేదు. 7.1 లీటర్ల ఇంపోర్టెడ్ మద్యం, ఒకటి న్యూ ఢిల్లీకి చెందిన నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం బాటిల్, 11 టీజీ ఐఎంఎఫ్ఎల్ బాటిళ్లు, మహారాష్ట్రకు చెందిన 0.75 లీటర్ల నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం, 11 కేఎఫ్ అల్ట్రా బీర్ బాటిళ్లు లభించాయి. ఈ పార్టీని ఆబ్కారీ శాఖ అనుమతి లేకుండా రాజ్ పాకాల నిర్వహించినట్టు తేలింది. అంతే కాకుండా నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం కూడా ఈ పార్టీలో వినియోగించినట్టు తేలింది. ఈ రెండు ఉల్లంఘనల నేపథ్యంలో తెలంగాణ ఎక్సైజ్ చట్టం 1968 34(ఏ), 34(1), 9(1) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశాం.

– కమలాసన్‌రెడ్డి, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

అనుమతి లేని మద్యం ఉన్నందుకే సోదాలు

రంగారెడ్డి డీసీ దశరథ్

హైదరాబాద్ సిటీబ్యూరో/శేరిలింగంపల్లి/కొండాపూర్: రాయదుర్గంలోని ఓరియన్ విల్లాస్ గేటెడ్ కమ్యూనిటీలో శైలేందర్ పాకాల, రాజ్ పాకాల ఇండ్లల్లో అనుమతి లేని మద్యం ఉన్నందుకే సోదాలు చేపట్టినట్టు రంగారెడ్డి జిల్లా డీసీ దశరథ్ తెలిపారు. ఆదివారం విల్లాస్‌లోని తనిఖీలపై ఆయన మాట్లాడారు. అనుమతి లేని నాన్‌డ్యూటీ పెయిడ్, ఫారిన్ లిక్కర్ ఉన్నందుకే తాము దాడులు చేస్తున్నామని ప్రకటించారు. ఇక్కడ విల్లాల ఓనర్స్ లేరని, వారికి సంబంధించిన వారు మాత్రమే ఉన్నారని, వారి సమక్షంలోనే సోదాలు చేస్తున్నామని చెప్పారు.

తలుపులు పగులగొట్టి తనిఖీలు..

ఓరియన్ విల్లాస్‌లో శైలేందర్ పాకాలకు చెందిన విల్లా నంబర్-5లో ఆబ్కారీ జేసీ ఖురేషీ ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు సోదాలు జరిపారు. షోకేజ్, గదుల తాళాలు పగులగొట్టి మరీ సోదాలు చేశారు. అదే సమయంలో రాజ్ పాకాలకు చెందిన విల్లా నంబర్-40లో 6 నుంచి 7గంటలపాటు విస్తృతంగా తనిఖీలు జరిపారు. యజమాని అనుమతి లేకుండా ఇంట్లోకి చొరబడడమే కాకుండా తలుపులు బద్దలు కొట్టారు.

ఇది ఇల్లీగల్ సెర్చ్: న్యాయవాది జెక్కుల లక్ష్మణ్

ఓరియన్ విల్లాస్‌లోని రాజ్ పాకాల, అతని బంధువుల ఇండ్లల్లో సెర్చ్ వారెంట్ లేకుండా ఇల్లీగల్ సెర్చ్ జరిగింది. పోలీసులు అక్రమంగా ఇండ్లల్లోకి చొరబడి ట్రెస్‌పాస్‌కు పాల్పడ్డారు. దీనిపై డీజీపికి ఫిర్యాదు చేశాం. ఈ విషయాన్ని కోర్టులో చాలెంజ్ చేస్తాం.